

దేవరగట్టు బన్ని ఉత్సవంలో సాగిన కర్రల సమరం

రక్తపుగట్టు

తిమ్మప్ప (ఫైల్) ఆంజనేయ (ఫైల్)

- దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో పగిలిన తలలు
- తలపగిలి ఒకరు, గుండెపోటుతో మరొకరు మృతి
- 90 మందికి గాయాలు, ఆరుగురి పరిస్థితి ఆందోళనకరం
- ఉత్సవమూర్తుల కోసం గ్రామాల మధ్య కర్రల సమరం
- సంప్రదాయం పేరిట ఆటవిక ఆచారం

దేవరగట్టు బన్ని ఉత్సవంలో హింస చెలరేగింది. దేవుడి దక్కించుకునే క్రమంలో గ్రామాల మధ్య జరిగిన కర్రల పోరులో ఇద్దరు మృతి చెందగా మరో 90 మందికి దాకా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. దసరా రోజున జరిగిన బన్ని ఉత్సవం రక్తసిక్తంగా మారింది. గురువారం అర్ధరాత్రి స్వామి, అమ్మవారి వివాహం తర్వాత దేవతామూర్తుల ఊరేగింపు మొదలైంది. ఉత్సవమూర్తులను తమ గ్రామాలకు తీసుకెళ్లేందుకు రెండు వర్గాల ప్రజలు పోటీ పడ్డారు. మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్రయాత్రలో రెండు వర్గాల ప్రజలు కర్రలతో ఘర్షణకు దిగారు. ఉత్సవమూర్తులను తీసుకెళ్లే విషయంలో పోటీపడటంతో హింస మొదలైంది.

వివరాలు 6లో



ఉత్సవాలను పరిశీలిస్తున్న ఎస్పీ



గొరవయ్యల ప్రదర్శన



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న భక్తులు





శ్రీశైలం దేవస్థానం బోర్డులో 16 మందికి చోటు

నంద్యాల/ డోన్ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యు లుగా 16మందికి అ వకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ట్రస్టుబోర్డులో శ్రీశైలానికి చెందిన చిటా బొట్ల భరద్వాజ్‌శర్మ, గుల్ల గంగమ్మ, ఎమ్మిగనూరుకు చెందిన రేఖాగౌడ్, నంద్యాలకి చెందిన సింధుశ్రీ, పాణ్యంకు చెందిన శివమ్మ నియమితులయ్యారు. డోన్ మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన జి.లక్ష్మీశ్వరికి చోటు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. డోన్ నియోజకవర్గం బేతంచెర్లకు చెందిన బుగ్గన చంద్ర మౌళీశ్వరరెడ్డిని ప్రత్యేక ఆహ్వానితుల కమిటీ సభ్యుడిగా నియమించారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీకి షాక్

- నలుగురు ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరిక
- కర్నూలు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం?



టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. కర్నూలు మండలంలో నలుగురు ఎంపీటీసీ సభ్యులు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈమేరకు శుక్రవారం కర్నూలులోని కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి వైసీపీకి చెందిన నలుగురు ఎంపీటీసీలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతనపల్లె, నందనపల్లె, రేమట, దిన్నెదేవరపాడు ఎంపీటీసీలు లక్ష్మీదేవి, జ్యోతి, కురువ సుజాత, రామనాథ్‌రెడ్డి సైకిల్ ఎక్కారు. అనంతరం వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు వివరించారు. కర్నూలు మండలంలో నలుగురు వైసీపీ ఎంపీటీసీలు ఒకేసారి టీడీపీలో చేరడంతో ఎంపీపీ పీఠంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు టీడీపీ నాయకులు కసరత్తు ప్రారంభించారు. ఎంపీపీ పదవిపై టీడీపీ ఎంపీటీసీలు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో సూదిరెడ్డిపల్లె వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ బి.వెంకటరాముడు, గార్గేయపురం మాజీ సర్పంచ్ టి.కౌలుట్లయ్య, రేమట టీడీపీ నాయకులు కురువ చంద్రశేఖర్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నేడు డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో 122 మంది డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు లభించనున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తెలిపారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి కలెక్టర్ ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇలాంటి మహనీయులను భావితరాలు స్మరించుకోవాలని వారు పిలుపునిచ్చారు.

ప్రధాని పర్యటనపై సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఈనెల 16వ తేదీన ప్రధాని పర్యటన నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులతో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ రానున్నారనీ తెలిపారు. నగరంలో ప్రధానమంత్రి 4వేల మందితో సమావేశం నిర్వహిస్తారన్నారు. రైతుబజారు సర్కిల్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు రోడ్‌షో ఉంటుందని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.


సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.


రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు


నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిధున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు


హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయుకుడు యనమల నాగార్జునయాదవ్

తామ్ర శాసనాలను ప్రదర్శిస్తాం

ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి


ప్రదర్శనకు తామ్రశాసనాలు (ఫైల్)


బంగారు, వెండి బిల్లలు (ఫైల్)

శ్రీశైలం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం రానున్న నేపథ్యంలో 2021వ సంవత్సరంలో ఘంటామఠంలో లభ్యమైన 21 సెట్లు తామ్ర శాసనాలను ప్రధాని తిలకించేందుకు ప్రదర్శనకు ఉంచుతామని ఏఎస్ఐ (ఆర్కియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) మైసూర్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. 17వ శతాబ్ది మధ్య పాలించిన రెడ్డి రాజులు, రెచెర్ల సామంతులు, విజయనగర రాజులు, ఒరిస్సాను పాలించిన గజపతులు, శ్రీశైలం రాజులు మల్లన్నకు సమర్పించిన బంగారు వివరాలను తామ్ర శాసనాల్లో పొందుపరిచినట్లు వివరించారు.

వీటి ద్వారా వచ్చే ఆదాయంతో శ్రీశైలానికి వచ్చే భక్తుల కోసం సత్రాలు, భోజన వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ తామ్ర పత్రాల ద్వారా ఆనాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మతపరమైన అనేక విషయాలు తెలుస్తాయన్నారు. ప్రత్యేకించి రెచెర్ల రాజైన లింగమనాయకా 1421వ సంవత్సరంలో వేయించిన తామ్రశాసనం ద్వారా అనేక అగ్రహారాలన్నింటిని ముస్లింలు అక్రమించుకొని స్వామివారి సేవలకు భంగం కలిగించిన సందర్భంలో లింగమనాయకా వాటన్నింటిని తిరిగి దేవాలయానికి సమర్పిస్తూ స్వరా జ్యంను పునరుద్ధరణ చేస్తారన్నారు. ఘంటామఠంలో బంగారం 699 గ్రాముల 630 మిల్లీగ్రాములు, వెండి 2 కేజీల 504 గ్రాములు లభ్యమైందని తెలిపారు.

చందన అలంకారంలో సుంకులాపరమేశ్వరి దేవి



గూడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో గూడూరు మండలం కె.నాగలాపురంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు గురువారం చందన అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా రోజున అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఈఓ రాధాకృష్ణ, గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ తదితరులు పర్యవేక్షించారు.

మహానందిలో తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి

మహానంది, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీటీ ఆశ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖ మండపం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు చేశారు. ఆలయ యాగశాల మంటపంలో వేద పండితులు వీరిని ఆశీర్వదించారు. ఈవో స్వామి వారి శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరివెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తపుగట్టు



ఆలూరు/హొళగుంద/ఆలూరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం దేవరగట్టులో బన్ని ఉత్సవం ప్రతి ఏటా దసరా పండుగ రోజున నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా మాళమల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను తమ గ్రామానికి తీసుకెళ్లేందుకు మూడు గ్రామాల ప్రజలు మరోవైపు కర్రలతో కొట్టుకోవడం ఇక్కడి ఆనవాయితీ. అందులో భాగంగానే గురువారం దసరా రోజున ఉదయం నుంచి రాత్రి వరకు మాళమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి డిర్ర్‌ర్ర్‌ర్.. గో పరాక్ అంటూ భక్తులు నినాదాలు చేస్తూ ఇనుప రింగులు తొడిగిన కర్రలు, అగ్ని కాగడాలతో బన్ని (కర్రల సమరం) ఉత్సవంలో పాల్గొన్నారు. అర్ధరాత్రి ఒళ్లు గగుర్పాటు కలిగించేలా సాగిన ఈ సమరంలో నెరణికి, నెరణికితండా, కొత్తపేట, ఎల్లార్తి, అరికెర, అరికెరతండా, బిలేహాల్ గ్రామాలకు చెందిన భక్తులు 800 అడుగుల ఎత్తులో ఉన్న మాళమల్లేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. అనంతరం కల్యాణోత్సవం తంతు పూర్తయ్యాక ఉత్సవమూర్తులను 350 మెట్లు దిగి కల్యాణకట్ట దగ్గరకు చేర్చారు. ఆ ప్రాంతంలో ఉత్సవమూర్తులను తమ గ్రామానికి తీసుకెళ్లేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ క్రమంలో నెరణికి గ్రామ ప్రజలను అరికెర గ్రామ ప్రజలు అడ్డుకుని పల్లకి, ఉత్సవమూర్తులను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామస్థులు ఒక్కసారిగా కోపోద్రిక్తులై కర్రలతో దాడి చేశారు. హోరాహోరీగా సాగిన ఈ బన్ని ఉత్సవంలో ఒకరిపైకరు రాళ్లు విసురుకున్నారు. అగ్ని కాగడాలు విసురుకున్నారు. ఈ ఘటనల్లో అరికెర గ్రామానికి చెందిన కోసిగి తిమ్మప్ప(50) తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య బసమ్మ, ఇద్దరు పిల్లలు సంతానం. ఉత్సవాలను చూసేందుకు వచ్చిన ఆదోని పట్టణంలోని అరుణజ్యోతినగర్‌కు చెందిన ఆంజనేయులు(47) గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఈయనకు భార్య, నలుగురు పిల్లలు సంతానం. ఈ ఉత్సవంలో 90 మంది గాయాలపాలయ్యారు. కొందరికి తలలు పగిలి రక్తం చిందింది. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరికొందరికి కాలిన గాయాలయ్యాయి. ఇందులో 11 మందికి తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



దేవరగట్టులో భవిష్యవాణి

దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్రయాత్రలో కీలక ఘట్టం భవిష్యవాణి (కార్ణికం). బన్నీ జైత్రయాత్ర ఊరేగింపు అనంతరం ఆదివారం ఉదయం 6:15 నిమిషాలకు ఎదురు బసవన్న గుడి వద్ద పూజారి గిరి మల్లయ్య స్వామి భవిష్య వాణి వినిపించారు. దేవరగట్టులో చెప్పే భవిష్యవాణిపై రైతులకు ఎంతో నమ్మకం. పూజారి గోపరాక్.. అనడంతో ఒక్కసారిగా భక్తులు నిశ్శబ్దాన్ని పాటించారు. కన్నడ భాషలో మాట్లాడుతూ...

- ఆరు అరడాదితూ హెచ్చరా (దేశరాజకీయాల్లో సంక్షోభం, యుద్ధ వాతావరణం నెలకొనవచ్చు. జాగ్రత్త వహించాలి)
- శక్తి ధ్యాన మాడబెకు (శక్తి స్వరూపిణి అమ్మవారిని ధ్యానించాలి)
- గంగి హోలేదండిగే నింతాలే, నీతూ ఉత్తర దిక్కలి సంహార మడిద్దాలే (గంగమ్మ నది ఒడ్డున నిలిచి, దేశ ఉత్తర దిక్కున సంహారం చేస్తుంది. ఉత్తర దిక్కున వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి)
- క్వింటాళ్ల 6,200/- నగె హత్తి (పత్తి)
- క్వింటాళ్ల 3,400/- జ్వాళ్ (తెల్ల జొన్న)
- 3-6.. 6-3.. మూడు ఆరు అవుతుంది. ఆరు మూడవుతుంది. వాణిజ్య పంటల ధరలు పెరిగి, తగ్గు ముఖం పట్టవచ్చు. రైతులు సుఖ సంతోషాలతో ఉంటారు. బహంపరాక్ అంటూ భవిష్య వాణి (కార్ణికం) ముగించారు.

కాళరాత్రి.. కాగడాల వెలుతురులో..

కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో దసరా పర్వదినాన బన్ని జైత్రయాత్ర ఉత్సవాలు ఏటేటా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. దుష్టశక్తులపై దైవశక్తులు సాధించిన విజయానికి గుర్తుగా విజయోత్సవ యాత్ర సాగిస్తారు. అందులో భాగంగానే గురువారం రాత్రి నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ఉత్సవమూర్తులు మాళ మల్లేశ్వరస్వాముల పల్లకిని వశం చేసుకోవడం కోసం సాగే బన్ని ఉత్సవం కర్రల సమరాన్ని తలపిస్తుంది. స్వామివారి రక్షణార్థులైన నెరణికి, నెరణికితండ, కొత్తపేట గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు కాగడాలు, కర్రలు చేతపట్టుకొని దైవకార్యం విజయవంతంగా నిర్వహించాలని డొళ్లబండ వద్దకు చేరుకున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో వైషమ్యాలు, విబేదాలు లేకుండా సమష్టిగా దేవుని కార్యం నిర్వహిస్తామని పాలబాసలు చేశారు. డిర్ర్‌ర్ర్‌ర్..గోపరాక్ (బహంపరాక్) అంటూ యుద్ధానికి సిద్ధమైన సైనికుల్లా పట్టుడు కర్రలు, కాగడాలు చేతపట్టుకొని దేవరగట్టు కొండపైకి చేరుకున్నారు. ప్రధాన అర్చకులు గిరి మల్లయ్యస్వామి ఆధ్వర్యంలో మాళ మల్లేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు. అప్పుడు సమయం అర్ధరాత్రి 1:15 గంటలు అయింది. ఉత్సవ మూర్తుల పల్లకితో కొండదిగి సింహాసన కట్టకు చేరుకున్నారు. అప్పటికే స్వామికోసం అక్కడ కర్రలతో సిద్ధంగా ఉన్న ఎల్లార్తి, అరికెర, అరికెరతండా, సులవాయి, ఆలూరు గ్రామాలకు చెందిన భక్తులు నెరణికి, నెరణి కితండా, కొత్తపేట గ్రామస్థులను అడ్డుకున్నారు. క్షణాల్లో వేలాది కర్రలు తలలపై నాట్యమాడాయి. ఓ వర్గం ముందుకు సాగితే, మరోవర్గం వెనుకడుగు వేసింది. కర్రల యుద్ధం తలపించేలా బన్ని ఉత్సవం సాగింది. చివరికి నెరణికి గ్రామస్థులు పైచేయి సాధించి ఉత్సవమూర్తులను వారి గ్రామానికి తీసుకెళ్లారు.

రక్తపడి వద్ద పిడికెడు రక్తం

తెల్లవారుజామున దేవరగట్టులోని రక్తపడి వద్దకు గొరవయ్య చేరుకున్నారు. ఈ సందర్భంగా పొడవైన దబ్బనం గుచ్చి పొడవైన దారాన్ని లాగారు. ఈ క్రమంలో వచ్చిన పిడికెడు రక్తాన్ని రక్తపడికి సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను శుక్రవారం ఉదయం 7 గంటలకు తిరిగి జైత్రయాత్రగా వచ్చి సింహాసనం కట్ట వద్దకు చేరుకోవడంతో బన్ని ఉత్సవం ముగిసింది.

ఉత్సవాలను తిలకించిన ఎస్పీ

బన్ని ఉత్సవాలను ఎస్పీ విక్రాంత్‌రెడ్డి, ఏఎస్పీ హుసేన్‌పీరా, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ఉత్సవాలను తిలకించారు. మీడియాతో ఎస్పీ మాట్లాడారు. సంప్రదాయంతో కూడుకున్న ఈ ఉత్సవాల్లో 90 మంది గాయాలపాలయ్యారన్నారు. ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తి గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. వెయ్యి మంది పోలీసు బలగాలను నియమించామన్నారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

దేవరగట్టుకు ఇటలీ దేశస్థులు

ఉత్సవాలను వీక్షించిన విదేశీయులు


ఉత్సవాలను తిలకిస్తున్న ఇటలీ దేశస్థులు

ఆలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు బన్ని ఉత్సవాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ ఏడాది ఉత్సవాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు విదేశీయులు తరలివచ్చారు. ఇటలీకి చెందిన ఓ బృందం దేవరగట్టుకు తరలివచ్చింది. ఇక్కడి కర్రల సమరాన్ని వారు ఆసక్తిగా తిలకించారు. ప్రతి సన్నివేశాలను కెమెరాలో బంధించారు. భక్తులతో కలిసి ఫొటోలు తీసుకున్నారు. ఇక్కడ కొనసాగుతున్న ఆచారం.. సంప్రదాయాలను తమ దేశంలో డాక్యుమెంటరీగా రూపొందిస్తామని ఇటాలియన్లు తెలిపారు. భారతదేశంలో అనాదిగా వస్తున్న ఇలాంటి ఆచారాలు దేశ ఐక్యతను చాటుతాయని వారు అన్నారు. అయితే భక్తి పేరుతో ఇలా తలలు పగులకొట్టుకోవడం ఒళ్లు గగుర్పాటుకు గురి చేస్తుందని వారి భాషలో తెలిపారు. స్థానిక ప్రజలు సాదరంగా ఆహ్వానించి తమను అక్కున చేర్చుకోవడంపై ఇటలీ దేశస్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు సైతం విదేశీయులకు రక్షణ కల్పించారు.

వైభవం.. మాళమల్లేశ్వరుడి కల్యాణం

- కర్రలతో కదనం రంగంలోకి..
- దేవరగట్టుకు పోటెత్తిన భక్తులు

ఆలూరు/ హొళగుంద, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేవరగట్టు మాళమల్లేశ్వరుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి 12.30 గంటల డిర్ర్‌ర్ర్ గోపరాక్ (బహంపరాక్) అంటూ వేలాదిగా భక్తజనం దేవరగట్టుపైకి చేరుకుంది. నేరణికి, నేరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన భక్తులు తలకు పాగాచుట్టి చేతిలో కర్రపట్టి యుద్ధానికి సిద్ధమైన సైనికుల్లా దేవుడి కార్యంలో నిమగ్నమయ్యారు. శుభముహూర్తం అర్ధరాత్రి 12.45 నుంచి 1.15 నిమిషాలకు వేదపండితులు రవిశర్మ మాళ మల్లేశ్వరస్వాముల కల్యాణోత్సవం నిర్వహించారు. జైత్రయాత్రకు సై అంటూ ఉత్సవ మూర్తులతో కొండ దిగి సింహాసన కట్ట వద్దకు చేరుకోగా దేవుడ్ని దక్కించుకోవడానికి అప్పటికే అక్కడికి చేరుకున్న పలు గ్రామాల భక్తులు కర్రలతో మేము సైతం అంటూ కదనరంగంలోకి దిగడంతో బన్ని ఉత్సవం మొదలైంది. 800అడుగుల పైభాగాల ఉన్న దేవరగట్టుపై దాదాపు అరగంట పాటు బన్ని ఉత్సవం జరిగింది. ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం దేవరగట్టు వేదికగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఉత్సవాన్ని కళ్లారా వీక్షించాలని రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు.

నెల్లూరులో వైద్య విద్యార్థిని ఆత్మహత్య



గీతాంజలి (ఫైల్)

నంద్యాల/నెల్లూరు వైద్యం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏమైందో ఏమోగానీ నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ వైద్యార్థిని శుక్రవారం బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. బండిఆత్మకూరు మండలం సంత జూటూరుకు చెందిన కెసంజీవరాయుడు, లక్ష్మీదేవి కుమార్తె బన్నెల గీతాంజలి నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో మెదటి సంవత్సరం మెడిసిన్ చదువుతూ కళాశాల హాస్టల్లో ఉంటోంది. థియరీ పరీక్షలు పూర్తవగా, దసరా సెలవులు సందర్భంగా తన స్నేహితురాలితో కలిసి తిరుతిలోని వారి ఇంటికి వెళ్లారు. 30వ తేదీన స్వగ్రామం సంతజూటూరుకు గీతాంజలి వెళ్లింది. శుక్రవారం ప్రాక్టికల్స్ పరీక్షలు ఉండటంతో గురువారం తిరిగి నెల్లూరుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం సహచర విద్యార్థిని హిమనందిని త్వరగా ప్రాక్టికల్స్ ఎగ్జామ్‌కు వెళ్లింది. ఏం జరిగిందో ఏమో తెలియదుకానీ గీతాంజలి తన గదికి తలుపుగడియ వేసుకుని బెడ్‌పై కుర్చీ వేసుకుని చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుంది. గీతాంజలి పరీక్షకు వెళ్లకపోవడంతో వసతి గృహ అధ్యాపక సిబ్బంది ఆమె గది వద్దకు వెళ్లి తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా లోపల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో వారు తలుపులు బలంగా నెట్టడంతో తెరుచున్నాయి. అప్పటికే గీతాంజలి ఉరికి వేలాడుతూ ఉంది. దీంతో వారు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం రోశయ్య చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు నెల్లూరుకు చేరుకుని విగతజీవిగా పడి ఉన్న గీతాంజలిని చూసి కన్నీరుమున్నీర య్యారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదోనిలో ఇంటర్ విద్యార్థిని..



ఎ లక్ష్మి (ఫైల్)

ఆదోని, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బావాజీపేటకు చెందిన బోయ లక్ష్మి(19) ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాలివీ.. పెద్దాంజని, సరోజ దంపతుల పెద్ద కుమార్తె లక్ష్మి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం పూజ చేసిన లక్ష్మి ఆ తర్వాత తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపు పగలగొట్టి చూడగా లక్ష్మి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. లక్ష్మి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం..

ఆదోని, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణం బావాజీపేటకు చెందిన సతీశ్ అనే యువకుడు శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో సతీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ సీఐ శ్రీరామ్ తన సిబ్బందితో హుటాహుటిన రాయ మిల్లు సమీపంలో ఉన్న పట్టాలపై తీవ్ర గాయాలతో ఉన్న సతీశ్‌ను ఆసుపత్రికి తరలించారు. అయితే అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే యువకుడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ, బైకు ఢీ.. ఒకరి మృతి

ఆస్పరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు బస్సు స్టాప్ సమీపంలో ఆదోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో శశిధర్‌రెడ్డి(35) అనే వ్యక్తి గురువారం రాత్రి అక్కడికక్కడే మృతిచెందాడు. తాడిపత్రి పట్టణానికి చెందిన శశిధర్‌రెడ్డి ఉద్యోగరీత్యా ఆదోనిలో నివాసముంటున్నాడు. తాడిపత్రి నుంచి దసరా పండగ ముగించుకుని తన బామ్మర్ది విష్ణువర్ధన్‌రెడ్డిని తన బైకుపై ఎక్కించుకుని ఆదోనికి వస్తుండగా గుంతను తప్పించబోయి ప్రమాదం జరిగినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. బైకు నడుపుతున్న శశిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న విష్ణువర్ధన్‌రెడ్డికి గాయాలైనట్లు సీఐ తెలిపారు. శశిధర్‌రెడ్డికి భార్య గౌతమి, ఒక కుమారుడు ఉన్నారు. గౌతమి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిలిండర్ పేలి ఇళ్లు దగ్ధం

- రూ.10లక్షలు ఆస్తి నష్టం



దగ్ధమైన ఇల్లు

అవుకు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్లు పేలి ఇళ్లు దగ్ధమైన ఘటన శివవరంలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుమారు రూ.10లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. వివరాలు.. మండలంలోని శివవరం గ్రామంలో దుబ్బా చిన్న గోవిందరెడ్డి, పుల్లారెడ్డి గురువారం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆమంటలు గ్యాస్ సిలిండర్ వైరుకు వ్యాపించాయి. సిలిండర్లు ఒకదానికి ఒకటి అంటుకొని పేలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు ఐదు తులాల బంగారు, రూ.2లక్షల నగదు, ఇంట్లో అగ్నికి ఆహుతైనట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ఆదోనిలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు..



కుప్పకూలిన పెంకుటిల్లు

ఆదోని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ లీకై పేలింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు తాలుకా ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం పెద్దపెండేకల్లుకి చెందిన వృద్ధులు ఆంజనేయ, ఈరమ్మకు ముగ్గురు కొడుకులు ఉన్నారు. వృద్ధులు, కుమారులు వేర్వేరుగా నాలుగు పెంకుటి గృహాల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం వీరంతా పొలానికి వెళ్లారు. పెద్దకుమారుడు ఈరన్న, కోడలు శారద పొలంలోనే ఉండిపోయారు. ఈరమ్మ వెంట వీరి కుమారుడు శ్రీకాంత్ ఇంటికొచ్చాడు. లోపలికెళ్లి లైట్‌ను వేయగానే ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఇల్లు మొత్తం కూలిపోయింది. ఈరమ్మ, శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్లకు చేయూత

- కర్నూలు జిల్లాలో 13,495 మంది లబ్ధిదారులు

కర్నూలు క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శనివారం ఒక్కొక్కరి ఖాతాలో రూ.15వేలు జమ చేసేందుకు సిద్ధమైంది. కర్నూలు జిల్లాలో 13,495 మంది ఆటో డ్రైవర్లు ఈ పథకం కింద లబ్ది పొందనున్నారు. రూ.20.24 కోట్లు విడుదల చేశారు. అత్యధికంగా కర్నూలు మండలంలో 5,169 మంది లబ్దిపొందనుండగా.. హోళగుందలో 31 మంది ఈ పథకం కింద లబ్ది పొందనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకంతో ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగు, సాగు నీటికి ఇబ్బందులుండవు

- భూగర్భజలాలు పెరుగుతాయి
- గైర్హాజరైన అధికారులకు నోటీసులివ్వండి
- జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి
- ముగిసిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్ ద్వారా సముద్రంలో కలిసే నీటిలో కొంత భాగాన్ని పోతిరెడ్డిపాడు ద్వారా కాలువలకు మళ్లిస్తే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం జడ్పీ మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

చైర్మన్ మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు నుంచి వరద నీటిని విడుదల చేస్తే జిల్లాలోని వెలుగోడు, గోరుకల్లు, అవుకు, రిజార్వయర్లను నింపుకోవడంతో పాటు కాలువల్లో నిరంతర ప్రవాహం ఉంటే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఈదిశగా నీటి పారుదల శాఖకు చెందిన ఇంజనీర్లు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది జూన్ 22నాటికి శ్రీశైలంలో 854 అడుగుల కంటే ఎక్కువ నీరు ఉండిందని, పోతిరెడ్డి పాడు ద్వారా నీటి ని విడుదల చేసి ఉంటే కనీసం బోర్లు రీచార్జ్ అయ్యేవన్నారు. శ్రీశైలం నీటి విడుదల మన చేతిలో లేదని, దీనికి తెలంగాణ ప్రభుత్వం, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అనుమతులు కావాలని సంబంధిత పర్యవేక్షక ఇంజనీరు ప్రతాప్ వివరించారు. జడ్పీటీసీలు, సుంకన్న, రంగనాథగౌడు, సుంకన్న ,పోచా జగదీశ్వరరెడ్డి, , ఉమ్మడి జిల్లాల అధకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ఎలాంటి అనుమతులు తీసుకోకుండా...

జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలలకు ప్రభుత్వ శాఖల అధికారులు తరచూ గైర్హాజరు కావడంపై జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అసహనం వ్యక్తంచేశారు. సహేతుకమైన కారణం లేకుండా, ఎలాంటి అనుమతి తీసుకోకుండా సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులకు నోటీసులు జారీ చేయాలని పాపిరెడ్డి డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డిని ఆదేశించారు.

పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు

జడ్పీ నిధులతో నిర్ణీత సమయంలో చేపట్టాల్సిన పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించి రూ.2.50 కోట నిధులు ల్యాప్స్ అయ్యేందుకు కారణమైన పీఆర్ ఇంజనీర్లపై చర్యలు తీసుకునేందుకు పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి చెప్పారు. ఈపనులను ఈఏడాది సెప్టెంబరు ఆఖరికి పూర్తిచేయకుంటే నిదులు ల్యాప్స్ అయ్యే ప్రమాదముందని ప్రతి నెలా పీఆర్ ఇంజనీర్లను హెచ్చరిస్తూనే ఉన్నా మన్నారు. అయినా పనుల్లో జరిగిన జాప్యంతో రూ.2.50కోట్ల నిధులు ల్యాప్స్ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

జోరుగా అవినీతి, అక్రమాలు

ఉపాధి హమీ పథకం పనుల్లో క్షేత్రస్థాయిలో అవినతి అక్రమాలు జోరుగా జరు గుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. గృహనిర్మాణాల ఫ్లెక్సీలు పెట్టుకుని ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని, ఇసుక రీచుల్లో వంద శాతం వాహనాల్లో గృహనిర్మాణాలకు అంటూ, 70వాహనాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్నారు.

భవిష్యత్తుకు పునాది పాఠశాలలోనే..



కర్నూలులో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు



నంద్యాలలో మాట్లాడుతున్న డీఈవో జనార్ధన్‌రెడ్డి

- విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్
- కర్నూలు, నంద్యాలలో నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పాఠశాలలోనే పడుతుందని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ పేర్కొన్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం నగర శివారులోని రాఘవేంద్ర బీఈడీ కళాశాలలో శిక్షణను ప్రారంభించారు. శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు విలువలతో కూడిన బోధనతో నవసమాజాన్ని నిర్మించాలని కోరారు. ప్రభుత్వ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డీఈవో శామ్యూల్ పాల్ మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దాదాపు అన్ని పోస్టులు భర్తీ చేయగలిగామని తెలిపారు. రిసోర్స్‌పర్సన్లు చెప్పే విషయాలను రాసుకుని అమలు చేయాలని కోరారు.

ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలి : డీఈవో

పాణ్యం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజయానికేతన్ పాఠశాలలో మెగా డీఎస్సీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. విద్యార్థులకు పునాదిలోనే క్రమశిక్షణతో కూడుకున్న చదువునందించాలన్నారు. ఈరోజునుంచి ఉపాధ్యాయులకు కొత్త జీవితం ప్రారంభమవుతుందని అన్నారు. కుటుంబ సమస్యలను అధిగమించి వృత్తికి న్యాయం చేయాలని అభిప్రాయపడ్డారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో 1,030 మంది ఉపాధ్యాయులకు ఈనెల 10 తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలులో శిక్షణకు అనుకూలంగా లేకపోవడంతో అనంతపురంలో రెండు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,600ల మంది శిక్షకులు పాల్గొంటారన్నారు. శిక్షణకు హాజరుకాని ఉపాధ్యాయులు వచ్చే నెల విజయవాడలో నిర్వహించే శిక్షణలో పాల్గొనాలన్నారు. శిక్షణలో పాల్గొనని ఉపాధ్యాయులకు ఆర్డర్ కాపీ ఇవ్వమన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. పాణ్యంలో 450 మంది శిక్షణలో పాల్గొంటున్నట్లు తెలిపారు. శిక్షణా కేంద్రాలలో వైద్య సహాయం, అంబులెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోర్స్ డైరెక్టర్లు కోటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, అలెస్కో సభ్యులు ప్రసన్నకుమార్, విజయానికేతన్ కరస్పాండెంట్ సంధ్యారాణి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల గుర్తింపులో జాప్యం ఎందుకు?

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్రమ నిర్మాణాలను గుర్తించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం నగర పాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల, సిబ్బందితో కలిసి ఓపెన్ ఫోరం నిర్వహించారు. అర్జీదారులు తమ సమస్యలను వెల్లడించగా, పరిష్కంరిచాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ పరిధిలోని ప్లానింగ్ కార్యదర్శి, కార్యదర్శులు గుర్తించిన అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టీపీవో అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

మహానంది, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయం ముఖమంటపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని అభిషేకార్చన పూజలు నిర్వహించారు. అలంకార మంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సన్మానించి, స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందజేశారు.

మంత్రాలయంలో..

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. పద్మనాభ విఐపీ గెస్ట్‌హౌస్ వద్ద ఆయనకు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి మంత్రాల యంలోనే బస చేసి శనివారం ఉదయం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేయనున్నారు. ఎస్ఐ శివాంజల్, జయతీర్థఆచార్, వ్యాసరాజాచార్, ఆంజనేయులు ఉన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖ ద్వారం, ప్రధాన రోడ్డు, రాఘవేంద్ర సర్కిల్ భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ శివాంజల్, పోలీసులు, శ్రీమఠం సెక్యూరిటీ ఆధ్వర్యంలో శ్రీమఠం ప్రాంగణంలో క్యూలైన్లు అదనంగా ఏర్పాటుచేశారు. ప్రసాదాల కొరత రాకుండా మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. లక్షలాది మంది భక్తులు తరలిరాగా దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దర్శనం చేసు కున్న భక్తులు ప్రాకారం నుంచి బయటికి వెళ్లాలని మఠం అధికారులు సూచించారు.

వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

- నలుగురికి గాయాలు
- ఐదుగురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగి ఇరువురు కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో ఇద్దరు వైసీపీ కార్యకర్తలకు రక్త గాయాలయ్యాయి. మరో ఇద్దరికి మూగ గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం జరిగింది. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, రేవనూరు ఎస్ఐ భూపాలుడు తెలిపిన వివరాలివీ.. కలుగొట్ల గ్రామంలో విజయదశమి పండుగ రోజున కనక దుర్గమ్మ గుడి వద్ద భజన చేయడానికి వైసీపీ వర్గీయులు పట్టుబట్టారు. దీంతో ఆలయ నిర్వాహ కులు వద్దని చెప్పి సర్ధిచెప్పారు. అయితే వైసీపీ వర్గీయులు భజన చేయకపోవడానికి అసలు కారణం టీడీపీ వర్గీయులైన గడ్డం నాగార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి అని, వీరిరువురినీ లేకుండా చేయాలని వైసీపీ వర్గీయులు చర్చించుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు అడిగేందుకు వెళ్లి వాగ్వాదం జరిగి మాట మాటా పెరిగి రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో తలారి శ్రీనివాసులు, పెద్దగురప్పకు రక్తగాయాలు కాగా మరో ఇద్దరికి మూగగాయాలయ్యాయి. సీఐ, ఎస్ఐ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని విచారించారు. గాయపడ్డ శ్రీనివాసులు, పెద్దగురప్పను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చిత్స చేయించారు. బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు నాగార్జున్‌రెడ్డి, చిన్నవలి, శీను, శేషు, వెంకటేశ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కలుగొట్లలో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని కార్యకర్తలను పరామర్శించారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

- నివాళి అర్పించిన ఎమ్మెల్యే, అధికారులు



జవాన్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పగిడ్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో హవాల్దార్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఆర్మీ జవాన్ బరికేల తిక్కస్వామి (34) అంత్యక్రియలు స్వగ్రామమైన పగిడ్యాలలో గురువారం ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించారు. అనారోగ్యంతో ఢిల్లీలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో తిక్కస్వామి భౌతికకాయాన్ని ఆర్మీ మేజర్ రాహుల్ దత్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో పగిడ్యాలకు గురువారం ఉదయం తీసుకొచ్చారు. దీంతో గ్రామంలో పండగ పూట విషాదచాయలు అలుముకున్నాయి. చుట్టు పక్కల గ్రామాలైన బీరవోలు, ఆంజనేయ నగర్, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు, బంధువులు అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకొని నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య జవాన్ తిక్కస్వామి భౌతికకాయానికి నివాళి అర్పించారు. అనతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిక్కస్వామి కుంటుబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం అండగా ఉంటుం దన్నారు. అలాగే తహసీల్దార్ శివరాముడు, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, నాయకులు నివాళి అర్పించారు. అనంతరం గాలిలోకి కాల్పులు జరిపి సైనిక లాంచనాలతో అంతక్రియలు నిర్వహించారు.

కశ్మీర్ ఎగ్జిబిషన్ అభినందనీయం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలో కశ్మీర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. గురువారం ఎంపీ బస్తిపాటి నాగరాజు,తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎగ్జిబిషన్ నగరానికి కొత్తదనం తెస్తుందని, మంత్రి టీజీ భరత్ రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. నిర్వాహకులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సమం నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య, నౌషద్, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టిన జగన్

కర్నూలు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో నాటి సీఎం జగన్ కేసీఆర్ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ కర్నాటక ఆల్మట్టి, మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టు ఎత్తు పెంపుపై టీడీపీ అధినేత చంద్రబాబు రాజీలేని పోరాటం చేశారని గుర్తుచేశారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర నీటి వాటాల విషయంలో గోదావరి ట్రిబ్యూనల్, కృష్ణ ట్రిబ్యూనల్‌లో సరైన న్యాయవాదులను పెట్టి సమర్థవంతమైన వాదనలు వినిపించలేక పోయారని మండిపడ్డారు.



ధరూర్ జేమ్స్

ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టుతిమ్మప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం కప్పట్రాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో అక్టోబరు 7న విజయవాడలో చేయనున్న ధర్నా కరపత్రాలను విడుదల చేశారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

వైసీపీ ప్లాన్ విఫలం

కర్నూలు అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోకి రాకుండా గూగుల్‌ను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు వేసిన మాస్టర్ ప్లాన్ విఫలమైందని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర అన్నారు. శుక్రవారం పార్టీకార్యాలయంలో మాట్లాడుతూ చనిపోయిన రైతు పేరుతో కేసువేసి అడ్డంగా బుక్కయ్యారన్నారు. రాష్ట్రాన్ని గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తుంటే అడ్డుంకుటున్నారని ఆరోపించారు. టీసీఎస్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించి హైకోర్టుచే వైసీపీ నాయకులు చివాట్లు తిన్నారని గుర్తు చేశారు.



నంద్యాల నాగేంద్ర

ఎస్సీ, ఎస్టీ బాధితులకు పరిహారం మంజూరు చేయాలి

- కేసుల విచారణపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు పరిహారం త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. 2013 నుంచి 2025 వరకు పెండింగ్ ఉన్న కేసులను పోలీసు అధికారులతో సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద నిధులు ఎంత ఖర్చు పెట్టారో వివరాలను ఇవ్వాలని అధికారిని ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరగా విచారణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, కర్నూలు ఆర్డీవో సందీప్, సాంఘీక సంక్షేమ అధికారి రాధిక, డీవీఎంసీ సభ్యులు సురేంద్ర, రవికుమార్, సురేష్, వెంకట నాగరాజు యాదవ్, మాలతి, మద్దిలేటి, కురువ మద్దిలేటి పాల్గొన్నారు.

వైభవంగా దసరా

- కర్నూలు, కోడుమూరు నియోజవర్గాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



ఎన్ఆర్‌పేటలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. లేబర్ కాలనీ, ఆర్టీసీ బస్టాండు, సంకల్‌బాగ్, ఓల్డ్ టౌన్, బుదవారపేటలో విగ్రహములను ప్రతిష్టించి పూజలు చేశారు. చిన్న అమ్మవారిశాల, పెద్ద అమ్మవారిశాల, కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి మాతకు ప్రత్యేకంగా అలంకరించి పండితుల వేదమంత్రాల సాక్షిగా పూజలు చేశారు. ఓల్డ్‌టౌన్ జమ్మిచెట్టుకు సాంప్రదాయబద్ధంగా శమివృక్ష పూజలు చేశారు. పండితులు, వేద మంత్రాలు వల్లిస్తుండగా.. మంగళ వాయిద్యాలతో శమీ వృక్షం చుట్టూ ప్రదిక్షిణలు నిర్వహించారు. చిదంబరరావు వీధిలో రాజస్థాన్ విష్ణు సమాజ్‌సంఘ్ దాండియా నృత్యం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ మాజీ ఎంపీ, పారిశ్రామికవేత్త టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. కాగా శనివారం సంకల్‌బాగ్ సమీపంలో తుంగభద్ర సమీపంలో నిమజ్జనం చేయనున్నారు.

కోడుమూరు రూరల్: పట్టణంలోని శమీవృక్షానికి పూజలు చేశారు. శమీపత్రం పెద్దలకు అందించి ఆశీస్సులు తీసుకున్నారు. గోరంట్ల, వర్కూరు గ్రామాల్లో లక్ష్మీమాధవ స్వామి, ప్యాలకుర్తిలో లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుంచి మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

సి.బెళగల్: మండలంలోని తిమ్మనదొడ్డి, కొత్తకోట, పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి, కంబందహాల్, బురాన్‌దొడ్డి, సిబెళగల్ గ్రావల్లో విజయదశమిని ఘనంగా జరుపుకన్నారు. గుండ్రేవుల, సంగాల, పలులకుదొడ్డి గ్రామాలలో దుర్గమాత, కాలికాదేవి, గజ్జలమ్మ, సుంకులమ్మకు పూజలు చేశారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, హుశేనాపురం, నన్నూరు, లొద్దిపల్లె, పూడిచెర్ల, ఉయ్యాలవాడ, సోమయాజులపల్లె, శకునాల తదితర గ్రామాల్లో విజయదశమి వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి ఆలయాల్లో పూజలు చేశారు. సాయంత్రం జమ్మిచెట్టుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ రాజారెడ్డి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవిందరెడ్డి, సుధాకర్ రావు, మోహన్ రెడ్డి, సీఎన్ సుధాకర్ రెడ్డ, చంద్రపెద్దస్వామి పాల్గొన్నారు.



హుశేనాపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



కోడుమూరు రూరల్ : ప్యాలకుర్తిలో ఊరేగింపు

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం

ఓర్వకల్లు మండలంలో శుక్రవారం దుర్గాదేవి నిమజ్జనం నిర్వహించారు. హుశేనాపురంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహానికి 9 రోజులు పూజలు చేశారు. ఎమ్మెల్యే గౌరు చరిత పూజలు చేశారు. విగ్రహాన్ని వాహనంపై ఊరేగింపు గా తీసుకెళ్లి కాల్వబుగ్గ సమీపాన మినీ రిజర్వాయరులో నిమజ్జనం చేశారు. సుదాకర్, రామగోవిందు, కేవీ మధు, బజారు, రాము, వేణు, గొల్ల నాగరాజు, మాజీ ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

- ఉప్పలపాడు, నన్నూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను వైభవంగా ఆయా గ్రామాల్లో నిమజ్జనం చేశారు.

కిలో చికెన్ రూ.120

- కోడుమూరులో ఓ వ్యాపారి విక్రయం.. ఎగబడ్డ ప్రజలు





దసరా సందర్భంగా కోడుమూరు పట్టణంలోని అబ్దుల్లా చికెన్ సెంటర్ యజమాని శుక్రవారం కిలో చికెన్ రూ.120లకే విక్రయించారు. దీంతో ప్రజలు చికెన్ కొనేందుకు ఎగబడ్డారు. కాగా మిగిలిన చికెన్ దుకాణాల్లో కిలో చికెన్ రూ.200లకు విక్రయించడంతో అవి వెలవెలబోయాయి. **- కోడుమూరు**



ఉర్దూ వర్సిటీలో గాంధీ జయంతి



గూడూరులో నివాళి అర్పిస్తున్న చైర్మన్, కమిషనర్

మహాత్మా గాంధీకి నివాళి

- నగరంలో గాంధీ జయంతి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి, పరిపాలన అధికారులు సిబ్బంది గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- నగర పాలికలో కమిషనర్ పి.విశ్వనాథ్ నివాళి అర్పించారు. డీసీ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి,తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ యూనివర్సిటీలో..

కర్నూలు అర్బన్: నగరంలోని ఉర్దూ యూనివర్సిటీలో గాంధీ జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్ఎస్ ఎం హుస్సేనీ నివాళి అర్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ కృపాకర్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్వర్యంలో అధ్యక్షుడువి. హనుమంతరావు చౌదరి కలెక్టరేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు

గూడూరు: నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం కార్యాలయంలో చైర్మన్ జె.వెంకటేశ్వర్లుతో కలిసి గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రజలకు ప్లాస్టిక్ అనర్థాలను వివరిస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు ఆర్.ఏ.వాసు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రమజీవుల చెమటకు పట్టం కట్టిన ప్రజా గాయకుడు దివంగత ఆర్.ఏ.వాసు అని సీపీఎం కార్యదర్శివర్గసభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధి నగర్‌లో వాసు 9వ వర్ధంతి నిర్వహించారు. ఎర్రజెండా చేతపట్టి సీపీఎం చేస్తున్న పోరాటాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా చూపారన్నారు. పీఎస్.రాధాక్రిష్ణ, టి.రాముడు, ఆర్ఏ.సుజాత, ఆర్.మద్దిలేటి, రోశయ్య, అయ్యన్న, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు



ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, జేడీఏ

కల్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కలెక్టర్ డా.సిరి, జేడీఏ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురం గ్రామంలో ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభించారు. 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడంతో వాహనాలు, వ్యవసాయ పరికరాలు, మందులు, విద్యుత్ వస్తువులు, నిత్యావసరాల ధరలు తగ్గాయన్నారు. గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. శ్మశాన వాటిక దారిలోని వంతెన కుంగి పోయిందని, గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డైరెక్టర్లు రామాంజనేయులు, నాగముని, ఇవీ రమణ, దేవలం కాటిశేఖర్, ఆకెపోగు వెంకటస్వామి, రామిరెడ్డి ఉన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సిబ్బందిని ఆదేశించారు. శక్రవారం నగరంలోని తెలుగుగేరిలో పర్యటించారు. రోజుల రోజుల తరబడి డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉంచవద్దన్నారు. ఇంట్లోకి దోమలు రాకుండా సాయంత్రం తలుపులు మూసి ఉంచాలని సూచించారు.

కాల్వబుగ్గ ఆలయ చైర్మన్‌గా నారాయణ

ఓర్వకల్లు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా హుశేనాపురం గ్రామానికి చెందిన కాటినేని నారాయణను నియమిస్తూ దేవదాయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మకర్తలుగా కే.రామచంద్రుడు, అలియాస్ కాకి దేవేంద్ర, ఎం.వెంకటలక్ష్మి, ఎల్.లక్ష్మిదేవి, ఎం.లక్ష్మిదేవి, పి.లక్ష్మిదేవి, ఎం.పెద్దమల్లయ్య, పి.లక్ష్మినారాయణ, జి.రామాంజనేయశర్మ, పుల్లమ్మ, ఎం.లక్ష్మబాయి, కే.లక్ష్మినరసింహశర్మ నియామకమయ్యారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మల్లెల రాజశేఖర్‌కు వీరు కృతజ్ఞతలు తెలిపారు.



భక్తుల మృతి బాధాకరం

కర్నూలు అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు బన్ని ఉత్సవంలో ఇద్దరు భక్తులు మృతి చెం దడం బాధాకరమని ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం కార్యాలయంలో మాట్లాడుతూ వందమందికి పైగా భక్తులు గాయపడటంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

6 నుంచి తపాలా వారోత్సవాలు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 14వ రకు డివిజన్‌లో ఆధార్ క్యాంపులు, మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు వివరాలకు 8919286402 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎద్దుల బండిని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

గూడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఎద్దుల బండిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపిన మేరకు.. పెంచికలపాడు గ్రామ రైతు పత్తి సంచులు వేసుకుని పొలం నుంచి ఇంటికి వస్తుండగా.. ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఎద్దులబండి నుజ్జునుజ్జయింది. బండిపై వెళ్తున్న ఇద్దరికి గాయాలు కాగా, ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉందని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

6న మండలాల్లో ధర్నా

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ 6న అన్ని మండలాల్లో ధర్నాలు చేయను న్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.రామాంజనేయులు, రైతు సంఘం కార్యదర్శి కె.జగన్నాథం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సాధారణం కన్నా 37.9 శాతం అధికంగా వర్షం కురవడంతో పంటలు నీట మునిగి కుళ్లిపోయాయన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె బాట



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు

- ఇన్ సర్వీస్ పీజీ కోటా పెంచాలని డిమాండ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామాల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి. జిల్లాలో 35 పీహెచ్‌సీలు ఉండగా, రోగులు ఓపీ సేవల కోసం వస్తుంటారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్దరించాలని కోరుతూఐదు రోజులుగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) పిలుపు మేరకు జిల్లాలోని దాదాపు 90 మంది వైద్యులు సమ్మెలో ఉన్నారు. గతంలో లాగనే పీహెచ్‌సీ వైద్యులకు పీజీ కోర్సుల ప్రవేశాల్లో 25 శాతం కోటా ఇవ్వాలని డాక్టర్స్ అసోసి యేషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.వి.మనోజ్, జాయింట్ సెక్రటరీ డా.మిధున్ కుమార్, డా.ఇబ్రహీం డిమాండ్ చేశారు.

కాగా సమస్యల పరిష్కారానికి వైద్యులు విజయవాడకు తరలివెళ్లారు. మరోపక్క సంఘం నాయకులతో ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తోంది.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కోడుమూరులో ఎమ్మెల్యే పర్యటన

కోడుమూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శుక్రవారం గుడిగాలి పర్యటన చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఖాజాఉస్సేన్ అనే వ్యక్తి ఇల్లు కూలిపోయిందని తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. డ్రైనేజీ సమస్యను ప్రజలు పరిష్కరించాలని పెద్ద బోయగేరి వాసులు ఎమ్మెల్యేను కోరారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంపీడీవో రాముడుకు సూచించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణికి సహకరి స్తానని హామీనిచ్చారు. కర్నూలు రోడ్డులో కాలనీలో వర్షపునీటితో నష్టపోయిన చేనేతలను పరామర్శించారు. ఎంపీడీవో రాముడు, తహసీల్దార్ నాగరాజు రామకృష్ణారెడ్డి, గంగాధర్ నాయుడు, బడెసాగౌడ్, మునిస్వామి పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

సి. బెళగల్: ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉందని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. గురువారం మండలంలోని మారందొడ్డి, సిబెళగల్, ఇనగండ్ల గ్రామాల బాధితులకు రూ.1,06,197ల చెక్కులను అందజేశారు. భీమన్న, హనుమంతు గౌడ్, సింగిల్ విండో ప్రసిడెంట్ తిమ్మప్ప, బాలజి వెంకటేశ్, దూద్‌వలి ఉన్నారు.



డీసీసీలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీజేపీ నిరంకుశ పాలన

కర్నూలు అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ నిరంకుశ పాలన కొనసాగిస్తోందని ఏఐసీసీ సభ్యుడు, కర్నూలు ఇన్‌చార్జి లక్ష్మీనరసింహ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ 156వ, లాల్ బహదూర్ శాస్త్రి 121వ జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నగర అధ్యక్షులు షేక్ జిలానీబాషా, అనంత రత్నం మాదిగ, బి. బతుకన్న, దామోదరం రాధకృష్ణ, సయ్యద్ ఖాద్రీ పాల్గొన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కార్మికుల సేవలు విలువైనవి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. గురువారం కార్యాలయంలో 'స్వచ్ఛత హి సేవా'లో 17 మంది ఉత్తమ కార్మికులను సత్కరించారు. డీసీ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఈ దారికి మోక్షమెన్నడో?

- గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్న చింతమానుపల్లె ప్రజలు



గుంతలు పడ్డ చింతమానుపల్లె రోడ్డు

సి.బెళగల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి చింతమానుపల్లె గ్రామానికి వేళ్లే రహదారి గుంతలమయంగా ఉంది. 6 కి.మీ దారిపొడవును గుంతలు ఉండటంతో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. దారి సరిగా లేకపోవడంతో గతంలో కర్నూలు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు కూడా రద్దు చేశారు. నూతన రహదారి నిర్మించాలని 15 సంవత్సరాల నుంచి కోరుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పత్తికొండ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని వైసీపీ మైనార్టీ నాయకులు సాబ్రుద్దీన్ నూర్‌బాషా, సీనియర్ న్యాయవాది మల్లికార్జున అన్నారు. దసరాను సందర్భంగా పట్టణంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి రెండు బహుమ తులు రూ.3116, రూ.2116 విజేత జట్లకు అందించారు. ఖలీల్, శీను, రామాంజనేయులు, వార్డు మెంబర్ షేక్షావలి పాల్గొన్నారు.

పత్తికొండ: క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ రామారావు అన్నారు. పత్తికొండ పట్టణంలో శుక్రవారం అండర్ -16 బాలుర క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. డోన్ ట్రాన్స్‌కో డిఈ పెద్దయ్య, శ్రీరామ ఆసుపత్రి ఎండీ నీలకంఠ, రాముఫ్యాషన్స్ అధినేత రాము, అంజి పాల్గొన్నారు.

పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచుకుందాం


కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశు భ్రంగా ఉంచడంలో పారిశుధ్య విభాగానికి చెందిన కార్మికులు అం దిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని మునిసిపాలిటీకు చెందిన పారిశుధ్య కార్మికులక కౌన్సిల్ హాల్ లో గాంధీ జయంతి సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించి మొమెంటోలను అందజేశారు. రానున్న రోజులలో పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా రూపొందించుకునే క్రమంలో పారిశుధ్య కార్మికుల సహకారం ఎంతైనా అవసరమన్నారు. డీఈ వెంకట చలపతి, రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్, మధుసూదన్ శర్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విజయదశమి


మద్దికెరలో అశ్వాల పారువేట నిర్వహిస్తున్న భక్తులు


దేవనకొండ: వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా మూడు కుటుంబాల పారువేట

మద్దికెర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని యాదవ రాజులైన పెద్ద నగిరి, చిన్న నగిరి, యామన్నన గిరి మూడుకుటుంబాల యాదవరాజులు ఎన్నో ఏళ్లుగా కొనసాగిస్తున్న రాచరిక సాంప్రదాయమైన అశ్వాల పారువేట వైభవంగా జరిగింది. విజ యదశమి సందర్భంగా మూడు కుటుంబాల యాదవరాజులు మజరా గ్రామమైన బొజ్జనాయుని పేట గ్రామంలోని శివాలయంకు రామ దుస్తు లతో ఖడ్గాలు ధరించి శివాలయంలో పూజలు చేసి అశ్వాల పారు వేట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల పారువేటలో పాల్గొన్న భక్తులు అశ్వాల పారువేటను తిలకించారు.

అంగరంగ వైభవంగా దసరా: మండలంలోని పెరవలి, మద్దికెర గ్రామాల్లో వెలసిన మద్దమ్మ కుంట నగరేశ్వరస్వామి దేవాలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.. మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవార్లక పజలు చేసి జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు. ఒకరికొ కరు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయ చైర్మన్ పారా దేవేంద్ర గౌడు, పెద్ద కోట్ల రమేష్, ఉన్నారు.

దేవనకొండ : మండలంలో వైభవంగా దసరా పండుగ వేడుకలు జరి గాయి. గురువారం ఉదయం దసరా పండుగ సందర్భంగా సుంకుల మ్మవ్వ, మారెమ్మ ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి, నైవైద్యం సమర్పించారు. .నవరాత్రుల పూజలందుకున్న దేవాలయాలలోని అమ్మ వారికి శుక్రవారం నిర్వహించిన వసంతోత్సవంతో వేడుకలు ముగిశాయి. దేవనకొండ చాకలీవీధిలో కొలువైన దుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వ హించి, చెరువులో నిమజ్జనం చేశారు.



గ్రామ సమస్యలను పరిష్కరిస్తాం ...

ఆదోని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సమ స్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని టీడీపీ మండల నాయకులు నెట్టేకల్లు నాగరాజు తెలిపారు. శుక్రవారం నెట్టేకల్లు గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ముందుగా గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని, ఆ సమస్యలన్నింటిని టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 03 (ఆంధ్రజ్యోతి) : ఆదోని శివారులో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని మెడికల్ కళాశాల సాధన కమిటీ గౌరవాధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్, యూజీ శ్రీనివాసులు, నూర్ అమ్మద్, ఫయాజ్ అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ భవనంలో ఆదోని మెడికల్ కళాశాల సాధన కమిటీ ఎన్నిక జరిగింది. కన్వీనర్ గాశ్రీనివాసులు, కో కన్వీనర్స్‌గా దస్తగిరి, అఖండ, రమేష్, సోమశేఖర్, ఉదయ్, తిరుమల సభ్యులుగా శ్రీనాథ్, సద్దాం, బాలు, నాగరాజు, తిప్పన, వెంకటేష్, అజిత్‌గౌడ్ శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

ఘనంగా కేఈ జన్మదిన వేడుకలు


పత్తికొండ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు


క్రిష్ణగిరిలో..

పత్తికొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటిసిఎం కేఈ క్రిష్ణమూర్తి పుట్టినరోజు వేడుకలు పత్తికొండ టీడీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్‌ను టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి కట్‌చేశారు. ముక్కుసాటిగా మట్లాడుతూ నిస్వార్థరాజకీయాలకు కేఈ క్రిష్ణమూర్తి పెట్టిందిపేరని కొనియాడారు. కరువుపీడిత ప్రాంతమైన పత్తికొండలో చెరువులకు హంద్రీనీవానీటితో నింపాలన్న సంకల్పంతో ప్రభుత్వంనుండి నిధులు తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. ఆయన వారసుడిగా ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన కేఈ శ్యాంబాబు తండ్రిఆశయాలకు వారసుడిగా నియోజకవర్గంలో ప్రతిఎకరాకు సాగునీరు అందించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి : మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి జన్మదిన వేడుకలను కోయిలకొండ గ్రామంలో తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబి సాహెబ్,మండల తెలుగుదేశం పార్టీ అద్యక్షుడు రామాకృష్ణాపురం దామోదర్ నాయుడు శ్రీకృష్ణ ఆలయంలో కేఈ కృష్ణమూర్తి జన్మదిన సందర్భంగా ఆయన పేరు మీద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు కటారుకొండ మర్రి శ్రీరాములు,సర్పంచ్ లక్ష్మీఈశ్వరయ్య, మాదాపురం గురుస్వామి,బోయ బొంతిరాళ్ళ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: కేఈ కుటుంబంతోనే బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగారనీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. గురువారం మండల కేంద్రమైన తుగ్గలి రాముల దేవాలయంలో మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుని స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మచ్చ లేని నాయకుడు, ఆయన అడుగుజాడల్లోనే పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నడుస్తున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్, వెంకట్రాముడు గౌడ్, శ్రీనివాసులు గౌడు, చక్రపాణి, సత్య, సంగాల క్రిష్ణ, రవిశంకర్ పాల్గొన్నారు.


తుగ్గలిలో..



అన్నదాతల కష్టాలు ప్రభుత్వానికి కనిపించవా ?

పత్తికొండ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టోపోయి కష్టాలు పడుతున్నా అన్నదాతల బాధలు ప్రభుత్వానికి కనిపించవా అని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సి.ఆర్.భవన్‌లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఈనెల 6వ తేదీన చేపట్టే ధర్నా కరపత్రాలను గిడ్డయ్య పార్టీ శ్రేణులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, మండల కార్యదర్శి కారుమంచి, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్రకుమార్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజా సంఘం నాయకులు కారన్న, వీరన్న, వెంకటరామిరెడ్డి, కాశీ, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'యాదవులు ఒకే తాటిపై నడవాలి'

మద్దికెర అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని యాదవులు అంతా ఒకేతాటిపై నడవాలని అఖిల భారత యాదవ సంఘం రాయల సమ కోకన్వీనర్ శేష ఫణియాదవ్ అన్నారు. శుక్రవారం మద్దికెరలో జరి గిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మద్దికెర గ్రామంలోని యాదవ రాజు కుటుంబీకులు నేటికి రాజకీయ సంప్రదాయమైన అశ్వాలపేట పారువేటే దృశ్యం హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్, యువజన కార్యదర్శి రామేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, విద్యాకళాశాల ఎండీ వెంకటమాధవ్, దత్తు యాదవ్ తదితరులు ఉన్నారు.

దేవరగట్టులో ఎమ్మెల్యే జయరాం పూజలు

ఆలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయంలో గుంతకల్ ఎమ్మెల్యే జయరాం గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండి కూటమి ప్రభుత్వం ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈయన వెంట జయరాం సోదరుడు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ మాజీ చైర్మన్ గుమ్మనూరు శ్రీవాసులు ఉన్నారు. దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో ఇద్దరు భక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు.





జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పరికరాలు

తుగ్గలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందించే సబ్సిడీ పరికరాలను జీఎస్టీ తగ్గించి ప్రభుత్వం అందిస్తుందని మారెళ్ల సొసైటీ సింగిల్ విండో అధ్యక్షులు వైవీ ప్రభాకర్ రెడ్డి, ఏవో సురేష్ యాదవ్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు గౌడు అన్నారు. శుక్రవారం ఎద్దులదొడ్డిలో ప్రభుత్వం అందించే వ్యవసాయ పనిముట్లు అందించారు. సర్పంచ్ విజయ్, టీడీపీ నాయకులు అధికారులు ఏఈవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం రైతులకు, ప్రజలకు ఎంతో అవసరమైన నిత్యావసర వస్తువులు రైతుల వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ తగ్గించడం వరం లాంటిదని వ్యవసాయ శాఖ అధికారి రవి అన్నారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామంలో రైతులకు జీఎస్టీ తగ్గడంతో ట్రాక్టర్‌ను కొనుగోలు చేయడంతో తగ్గింపు వర్తించినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు బురుజుల మోహన్, నాయుడప్ప, పాల్గొన్నారు.

భక్తుల మృతి బాధాకరం

ఆలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేవరట్టు బన్ని ఉత్సవాల్లో ఇద్దరు భక్తులు మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

చీరల పంపిణీ

పత్తికొండ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్ర చీరలను పంపిణీ చేశారు. విజయదశమి పండగను పురస్కరించుకుని సీపీఎం నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్వరరెడ్డితో కలిసి రవిచంద్ర పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ప్రజా సంఘాల నాయకులు కాశీ, దుగ్గెన్న, మైనార్టీ నాయకులు ఉసేని పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం రావాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలని జడ్పీటీసీ పులికొండ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, జిట్టా నగేష్ అన్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో గాంధీ జయంతిని పురస్కరి ంచుకుని సచివాలయాల్లో, కార్యాలయాల్లో గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు వెంకట్, గోవింద్ పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

ఆదోని టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న వారికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డా. గోపీనాథ్, ప్రసాద రావు అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం తోపాటు, లాల్ బహుదూర్ శాస్త్రి, మహాత్మాగాంధీ జయంతిని శుక్రవారం నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, బ్రేడ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, విశిష్ట సభ్యులు ఓం ప్రకాష్, జితేంద్ర, రాజేంద్ర, నీలమోహన్ పాల్గొన్నారు.

● అవోపా ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంచి పెట్టారు. అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి రఘు, సభ్యులు రాఘవేంద్ర, రఘు, మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, శ్రీదేవి, సంతోషి, ప్రసన్న పాల్గొన్నారు.

కాటి కాపరులను ఉద్యోగులుగా గుర్తించాలి

ఆదోని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాటి కాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటి కాపరుల సంఘం జిల్లా అధ్యక్షులు తిక్కప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, స్మశాన వాటికలో గుంతలు తీసే వారిని, స్మశాన వాటికకు కాపలాగా ఉండే కాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులను ఇవ్వాలని, సమాన భీమా కల్పించాలన్నారు



వైభవంగా విజయదశమి

● శమీ వృక్షాలకు పూజలు
● ఘనంగా అమ్మవారి నిమజ్జనోత్సవం
● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



మాధవరంలో అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



గోనెగండ్లలో.





కందనాతి గ్రామంలో ఉత్సవంలో పాల్గొన్న భక్తులు, చెన్నకేశ్వ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో దసరశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఆయా ప్రాంతాల్లో వెలసిన అమ్మవారి ఆలయాల్లో విజయదశమిని పురస్కరించుకొని గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత కన్యకా పరమేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేను ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మాచాని మహేశ్, సంఘం అధ్యక్షుడు ప్రతాప్ శ్రీకాంత్, వెంకటగిరి, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్యంగా కందనాతి గ్రామంలోని కొండపై వెలసిన చెన్నకేశవస్వామి పల్లకోత్సవాన్ని కందనాతితో పాటు మసీదుపురం, మాస్‌మాన్‌దొడ్డి, వెంకటగిరి గ్రామాల ప్రజలు కొండపై నుంచి కడివెళ్ల రహదారిలో ఉన్న జమ్మిచెట్టువరకు భుజాలపై మోస్తు ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి యథాస్థానికి చేర్చారు. పల్లకోత్సవంలో వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ ఈశ్వర్‌కు ఎడమ భుజంపై తీవ్ర గాయం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే కందనాతి గ్రామానికి చెందిన ఓ భక్తుడితో పాటు వెంకటగిరి గ్రామానికి చెందిన కోట ఉరుకుందు, రామాంజిని, సురేంద్ర, వీరేశ్‌కు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అయితే ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ ఎస్‌ఐ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కందనాతి గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామి, మారెమ్మవ్వలను దర్శించుకున్నారు.

గోనెగండ్ల: మండలంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజులదిన్నె ప్రాజెక్టులో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మంత్రాలయం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంతో పాటు మండలంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. గురు, శుక్రవారాలు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జమ్మీవృక్షానికి పూజలుచేసి హారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించారు. మంచాలమ్మ దేవతకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సత్రంలో 9 రోజులపాటు పూజలు అందుకున్న కన్యకాపరమేశ్వరి దేవతను, మాధవరంలో గంగాభవానీ దేవతను ప్రత్యేక వాహనాలపై ఉంచి భారీ ఊరేగింపు నిర్వహించి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

పెద్దకడబూరు: మండలంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

విజయానికి ప్రతీక దసరా

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి



దసరా ఉత్సవాల్లో పాల్గొన్న దేశాయి

నందవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగానే విజయదశమిని నిర్వహించుకుంటున్నామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేశాయి మాధవరావు అన్నారు. దశమి సందర్భంగా గ్రామంలో కులమతాలకతీతంగా అన్ని వర్గాలతో ఇంటి నుంచి ఉత్సవమూర్తిని ఊరేగింపు ముందు దేశాయి మాధవరావు కొమ్ము ఊపి కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం ఇంటి నుంచి గ్రామ పుర వీధుల గుండా ఆంజనేయ స్వామి ఆలయం గుడి మీదుగా వందలాది మంది భక్తుల అమ్మవారి పల్లకిని ఊరేగిస్తు ఉత్సవమూర్తి పేరుతో నినాదాలు చేస్తు ఊరేగింస్తుండడంతో భక్తులు ఇంటి ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తు సాగనంపారు. అనంతరం జమీవృక్షం దగ్గర వరకు ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. దేశాయి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బీవీ



కలెక్టర్ సిరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఏ సిరిని కర్నూల కలెకరేట్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో జరుగుతున్న టెక్స్‌టైల్ పార్కు గురించి, ఎంఎస్‌ఎంఈలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ తీసుకొచ్చే విషయమై చర్చించినట్లు తెలిపారు. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల మరమ్మతులతోపాటు ఇతర అభివృద్ధిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన అధికవర్షాల వల్ల పత్తిరైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆరైతులకు సహాయం అందించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

క్రీడల వైపు ప్రోత్సహించాలి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్‌పాల్

పెద్దకడబూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని డీఈవో శామ్యూల్‌పాల్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న అన్నారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు అబ్దుల్లా, రంగప్ప, దాసు, విల్సన్, తిక్కన్న, రామన్న, సతీష్, కల్యాణ్, రాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గోనెగండ్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని నియోజకవర్గ టీడీపీ నాయకుడు, ప్రముఖ వ్యాపరవేత్త భాస్కర్ల చంద్రశేఖర్, మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు అన్నారు. జిల్లా స్థాయి బీవీ స్మారక క్రికెట్ పోటీలో విజేతలకు శుక్రవారం బహుమతులను, ట్రోఫీ అందజేశారు. మొదటి బహుమతి రూ. 30,016 లను ఎమ్మిగనూరు, రెండో బహుమతి రూ. 20,016 గోనెగండ్ల టీమ్‌లకు భాస్కర్ల చంద్రశేఖర్ అందజేశారు. టీడీపీ నాయకులు బాషా, రమణచౌదరి, రెహంతుల్లా, నజీర్‌సాహెబ్, రఫీక్, రమేష్‌నాయుడు, రవి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఆల్‌ఫ్రెడ్ రాజ్, జగదీశ్, అడ్వకేట్ చంద్రశేఖర్, పెద్దయ్య పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటాం'

మంత్రాలయం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసిన నాయకులను, కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి అన్నారు. మండలంలోని రాంపురంలో శుక్రవారం వైసీపీ రాష్ట్ర కార్యనిర్వహక మండలి సభ్యుడిగా ఎంపికైన ఆర్‌పురుషోత్తంరెడ్డిని సన్మానించారు. వైసీపీ మండల అధ్యక్షుడు గురెడ్డి భీమిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామాంజనేయులు, మూకయ్య, ఈరన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి పరామర్శ

నందవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నాగప్పను వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. గత కొనేళ్లగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగప్పతో మాట్లాడి తమ వంతు అన్ని రకాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు గడ్డం నారాయణరెడ్డి, రాజేశ్, షేక్ అహ్మద్, అతావుల్లా, జాన్, సోమన్న తదితరులు ఉన్నారు.

దస్తగిరి స్వామి ఉరుసు ప్రారంభం

మంత్రాలయం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు, మాధవరం, తిమ్మాపురం, రాంపురం, సూగూరు గ్రామాల్లో వెలసిన దస్తగిరిస్వాముల ఉరుసు మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం కులమతాలకు అతీతంగా నిర్వహించే దస్తగిరి స్వాముల ఉరుసులో భాగంగా గంధం నిర్వహించారు. దర్గావద్దకు జెండాను ఊరేగింపుతో తీసుకొచ్చి ఆవిష్కరించారు. అనంతరం సుంగంధ ద్రవ్యాలు, పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. దర్గాను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో వగరూరు పురవీధులన్నీ కిక్కిరిశాయి.

గాంధీకి ఘన నివాళి



గోనెగండ్లలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కేశన్నయాదవ్‌తో పాటు తహసీల్దార్, రూరల్ పోలీస్ స్టేషన్లలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గోనెగండ్ల: గోనెగండ్లలోని టీడీపీ కార్యాలయం దగ్గర గాంధీ చిత్రపటానికి, సంతమార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహానికి పూలమాలల వేసి ఘనంగా నివాళి అర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు మహల్ రెహంతుల్లా, మాజీ సర్పంచ్ రంగముని, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఫకృద్దీన్, నూరమహ్మద్, మునెప్ప, ఒంటెడుదిన్నె మిన్నల్ల, రామాంజినేయులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనాథ ఎరుకుల నాగమ్మ (70)కు పూలే అంబేడ్కర్ సొసైటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సొసైటీ సభ్యులు నరసన్న, వెంకోబు మాట్లాడుతూ నాగమ్మ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రిలో నిద్రిస్తూ ఉండేది. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అపస్మారక స్థితిలో పడి ఉండగా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ సమాచారం అందించగా నాగమ్మ సమాచారం సేకరించి తనకు ఎవరూ లేరని నిర్ధారించి కేసు నమోదు చేశారు. దీంతో సొసైటీ సభ్యులు కుర్ది శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో షాలేము, అబ్రహాం, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకుడు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని, అనుమతులు లేని నవోదయ కోచింగ్ సెంటర్లపై, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు ఆఫ్రిది, ఖాజా, రఘు, శేఖర్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని సరైన అనుమతులులేని ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు చేయగా, విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు సెప్టెంబరు 19వ తేదిన నవోదయ కోచింగ్ సెంటర్‌లపై, ప్రైవేట్ పాఠశాలలపై తమ కమిటీ బృందాలతో విచారణ చేపట్టారు. విచారణ జరిపి వారాలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ఫిర్యాదు చేశామన్నారు. అందుకు ఆమె స్పందించి సరైన అనుమతులు లేని పాఠశాలలను, నవోదయ కోచింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలికే విధంగా ఉందన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలకు సహకరించే అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్న చర్యలు తీసుకోకపోవడంపై అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. వారంరోజుల్లో చర్యలు చేపట్టకపోతే డీఈవో ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మంత్రాలయం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ముందు కేవీపీఎస్ జెండాను ఎగురవేశారు. నాయకులు అంజి, అనిల్, ఏలియా, చిన్న అంజనయ్య, దేవపుత్ర, దేవ, తిక్కయ్య, భీమన్న, వీరేష్, అనుమంతులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేస్తామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, ఉపాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. గోనెగండ్ల మండలంలోని ఎర్రబాడు, ఐరన్‌బండ, గోనెగండ్ల గ్రామాల్లో కులవివక్ష వ్యతిరేఖ పోరాట సమితి 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రాపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మారేష్, దేవదాస్, రంగన్న, మల్లికార్జున, సుంకన్న, సోమన్న, జయరాజు, శాంతిరాజు, రామాంజి, గోవిందు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లోకి వర్షపు నీరు

● యజమానులకు రూ. లక్షల్లో నష్టం



పెట్రోల్ బంకు ట్యాంకులో చేరిన వర్షపు నీరు

ఎమ్మిగనూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు చేతికొచ్చిన పంటలు నీటిపాలైన అన్నదాతలు ఊహించని నష్టాలు.. కష్టాలు చవిచూశారు. తాజాగా ఆ జాబితాలో పెట్రో బంకుల యజమానులు కూడా చేరారు. అధికవర్షాలు, సమీపంలో ఉన్న వంకలు, వాగులు పొంగి.. భూగర్భంలో ఉండే ట్యాంకుల్లో నీళ్ల చేరటంతో రూ. లక్షలు విలువైన పెట్రోల్, డీజీల్ నాణ్యత దెబ్బతిని యజమానులు ఆర్థికంగా తీవ్ర నష్టం చవిచూసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని మంత్రాలయం - ఆదోని రహదారిలో ఉన్న ఉషాకిరణ్ సర్వీస్ స్టేషన్ పెట్రోబంకులో భూగర్భంలో ఏర్పాటు చేసిన ట్యాంకుల్లో అధిక వర్షాలకు నీళ్ల చేరి పెట్రోల్, డీజీల్ నాణ్యత దెబ్బతిన్నట్లు యాజమాన్యం గుర్తించింది. ఇందన సంస్థ టెక్నికల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా అమ్మకాలు ఆపేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో ట్యాంకులను శుభ్రం చేసి ఆతరువాత విక్రయాలు చేపట్టారు. వేలాది లీటర్ల పెట్రోల్ నాణ్యత దెబ్బతిని రూ. లక్షలు నష్టపోయామని ఓ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. బంకు పక్కనే ఉన్న వంకను స్వార్థపరులు పూడ్చేయటంతో గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు.. ఆ నీరు వేల్లే దారిలేక కాలనీలను ముంచెత్తినట్లు వారు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంధన సంస్థలు ఇథనాల్‌తో కూడిన పెట్రోల్ సరఫరా చేస్తున్నాయి. ఇథనాల్ మిళితమైన పెట్రోల్ నిల్వల్లో నీటి చుక్క కలిపినా క్రమంగా ఇథనాల్ పెట్రోల్ నుంచి విడిపోయి నీరుగా మారుతుందని ఇంధన నిపుణులు పేర్కొంటున్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ

గోనెగండ్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సీఎస్టీ 2.0తో నిత్యావసర, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గుతాయని రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అవగాహన కల్పించారు. శుక్రవారం గాజులదిన్నె గ్రామంలో నూతన జీఎస్టీ 2.0 పై ప్రజలలోకి తీసుకెళ్లే అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 తో వ్యాపార రంగంలో కీలక మార్పులు వస్తున్నాయని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దేవవ్యాప్తంగా అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ సంజన్న, యాకోబ్, ఉపసర్పంచ్ రాజు, రాముడు, కూటమీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

కౌతాళం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల ద్వారా ఉజ్వల భవిష్యత్తు కలదని పీఎంశ్రీ వృత్తి విద్య కోర్సుల శిక్షణ ఉద్యోగులు రామాంజనేయులు, రాజు అన్నారు. కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులలో భాగంగా ఆటో మొబైల్ రంగంలో శిక్షణ ఇప్పించారు. గత నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శిక్షణ కల్పించారు.

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. శుక్రవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషే కాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు. వేలాది మంది భక్తులకు పీఠాధిపతి స్తప్త ముద్రధారణ చేశారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు.

నేడు 'ఆటో డ్రైవర్ల సేవ'ను విజయవంతం చేయాలి

మంత్రాలయం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ల సేవ' అందజేస్తుందని, డ్రైవర్లందరూ విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మాధవరం నుంచి మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్ వరకు ఆటో ర్యాలీ నిర్వహిస్తున్నామని నియోజకవర్గంలోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి డ్రైవర్‌కు రూ.15వేలు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో 'ఆటో డ్రైవర్ల సేవ' ప్రారంభోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

బహుమతుల ప్రదానం

నందవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా నందవరంలో హరే శ్రీనివాస యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు శుక్రవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా నందవరం దుర్గ జట్టుకు రూ.10,016, రెండో బహుమతి పూలచింత జట్టుకు రూ.5016, మూడో స్థానంలో నిలిచిన ఆదోని జట్టుకు రూ.3,016 దేశాయి అందజేశారు. టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ తిమ్మరాజు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు లచ్చప్ప నాయుడు, మైనార్టీ నాయకులు షరీఫ్, వీరేశ్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, శ్రీనివాసులు, నరసింహులు, పంపయ్య పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

కౌతాళం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజ మార్పు సాధ్యమని మాజీ వైస్ ఎంపీపీ అమరయ్య స్వామి అన్నారు. ఇటీవల వీరశైవ జంగమ కులస్థులు ఏపీ డీఎస్సీలో ప్రతిభ చూపి ఉపాధ్యాయులుగా ఎంపికైన కౌతాళం గ్రామ లింగాయత్ యువకుల సన్మాన కార్యక్రమాన్ని హిరే మఠంలో నిర్వహించారు. ఉద్యోగాలు పొందిన ఐదుగురిని మఠం తరపున పూలమాల శాలువాలతో సన్మానించారు.

మద్యం స్వాధీనం

మంత్రాలయం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన బోయ నాగేశ్ అనే వ్యక్తి అక్రమంగా అదే గ్రామంలో అమ్ముతుండగా ఎస్‌ఐ శివాంజల్ దాడులు చేసి పట్టుకు న్నారు. శక్రవారం 180 ఎంఎల్ మద్యం 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది మల్లికార్జున స్వామి, రామకృష్ణ, పరమేశ్, రాముడు పాల్గొన్నారు.

అద్దె చెల్లించకపోతే సామగ్రి వేలం

ఎమ్మిగనూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ది ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ మిల్క్ సొసైటీ లి. భవనాన్ని అద్దెకు తీసుకున్న ఓ హాస్పిటల్ యాజమాన్యం 26నెలల అద్దె చెల్లించాలని, లేని పక్షంలో సీజ్ చేసిన సామాగ్రిని వేలం వేస్తామని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి రామరాజు నోటీసు జారీ చేశారు. హాస్పిటల్స్ యాజమాన్యం ఈనెల 6వ తేదిలోపు సొసైటీ యాజమాన్యాన్ని సంప్రదించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 8వ తేది ఉదయం 11 గంటలకు సంఘం ఆవరణంలో బహిరంగంగా వేలం వేస్తామని తెలిపారు.

జీడీపీ నుంచి హంద్రీకి నీటి విడుదల

గోనెగండ్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి శుక్రవారం తెల్లవారుజామున నుంచి జీడీపీ ఇరిగేషన్ అధికారులు హంద్రీనదికి జీడీపీ 4వ గేట్లు ద్వార నీటి విడుదల చేశారు. ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి 336 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. బుధవారం సాయంత్రం ప్రాజె క్టుకు వరదనీరు చేరడం నిలిచి పోవడంతో ప్రాజెక్టు గేటు మూసి వేశారు. అయితే గురువారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో ఒక మోస్తారు వర్షం కురియడంతో వరద నీరు వచ్చి చేరుతుంది అలాగే ఎల్లెల్సీ నుంచి 150 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 100 క్యూసెక్కుల నీరు జీడీపీని చేరుతున్నాయి. దీంతో జీడీపీ నుంచి నీటి విడుదల చేశారు. ప్రస్తుతం గాజలదిన్నె ప్రాజెక్టు లో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రకు నీటి మట్టం(4 టీఎంసీ) 376.78 మీటర్లు ఉంది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.22 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు లో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటని ఎప్పటి కప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.